సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

శనివారం । 13 । సెప్టెంబర్ । 2025



గంజాయి ముఠా అరెస్ట్

అంతరాష్ట్ర గంజాయి ముఠాను శుక్రవారం పోలీసులు అరెస్ట్ చేశారు. 86 కేజీల గంజాయి లభించింది 8లో



ఈజీగా రాజీ!

కొత్తగూడెం, భద్రాచలం, మణుగూరు, దమ్మపేట, ఇల్లెందు కోర్టుల్లో శనివారం లోక్ అదాలత్ నిర్వహించనున్నారు. 8లో

గరిష్టం / కనిష్టం 31°/ 24°

వాతావరణం

జిల్లాలో శనివారం ఆకాశం మేఘావృతంగా మారే అవకాశం ఉంది. అక్కడక్కడా జల్లులు కురుస్తాయి.

న్యూస్‌రీల్

స్వర్ణ కవచధారణలో రామయ్య



స్వామివారి నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలోని మూలమూర్తులు శుక్రవారం స్వర్ణకవచధారులై దర్శనమిచ్చారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామివారికి విష్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. శుక్రవారం సందర్భంగా లక్ష్మీతాయారు అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

పెద్దమ్మతల్లికి పంచామృతాభిషేకం



అమ్మవారికి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి అమ్మవారికి శుక్రవారం వైభవంగా పంచామృతాభిషేకం నిర్వహించారు. మండలంలోని శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయంలో శుక్రవారం అర్చకులు అమ్మవారి జన్మస్థలం వద్ద పంచామృతం, పసుపు, కుంకుమ, గాజులు, హారతి సమర్పించారు. అనంతరం ఆలయంలోని మూల విరాట్‌కు పంచామృతంతో అభిషేకం పంచ హారతులు, నివేదన, నీరాజనం, మంత్రపుష్పం పూజలతోపాటు కుంకుమపూజ, గణపతిహోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈఓ రజనీకుమారి, ఆలయ కమిటీ చైర్మన్ బాలినేని నాగేశ్వరరావు పాల్గొన్నారు.

జూలూరుపాడు మార్కెట్‌కు రూ.3 కోట్లు



మార్కెట్ స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

జూలూరుపాడు: జూలూరుపాడు వ్యవసాయ మార్కెట్ నిర్మాణానికి రూ.3.03 కోట్లు మంజూరు చేసినట్లు రాష్ట్ర మార్కెటింగ్‌శాఖ అడిషనల్ డైరెక్టర్ రవికుమార్ తెలిపారు. శుక్రవారం మార్కెటింగ్ శాఖ వరంగల్ రీజినల్ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాస్‌తో కలిసి ఆయన జూలూరుపాడు శాశ్వత వ్యవసాయ మార్కెట్ నిర్మాణానికి కేటాయించిన ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఈనెల 25న టెండర్ ప్రక్రియ జరుగుతుందని, అనంతరం మార్కెట్ నిర్మాణ పనులు ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంఓ నరేందర్, ఏఎమ్మార్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి బజారు, సిబ్బంది పాల్గొన్నారు.

15న సైన్స్ సెమినార్

కొత్తగూడెంఅర్బన్: ఈ నెల 15న జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో 'క్వాంటం ఏజ్ బిగిన్స్ పొటెన్షియల్స్ – చాలెంజెస్'అనే అంశంపై జిల్లా విద్యా శిక్షణా కేంద్రంలో సెమినార్ నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి బి.నాగలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల నుంచి 8 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు సెమినార్‌లో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ప్రతీ పాఠశాల నుంచి ఒక్కరు లేదా ఇద్దరు విద్యార్థులకు మాత్రమే అవకాశం ఉంటుందని తెలిపారు. గరిష్టంగా ఐదు చార్టులు, పవర్ పాయింట్‌కు సంబంధించి ఐదు స్లైడ్‌లు ప్రదర్శించవచ్చని, పోటీలో పాల్గొనే విద్యార్థులు వివరాలను నమోదు చేసుకోవాలని వివరించారు. ఇతర వివరాలకు జిల్లా విద్యాశాఖ అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఏ.నాగరాజ శేఖర్‌ను సంప్రదించాలని కోరారు.

కిన్నెరసాని నుంచి నీటి విడుదల

పాల్వంచరూరల్: ఎగువన కురుస్తున్న వర్షాలకు కిన్నెరసాని జలాశయంలోకి వరద ఉధృతి కొనసాగుతోంది. 407 అడుగుల నీటినిల్వ సామర్థ్యం కలిగిన కిన్నెరసాని రిజర్వాయర్‌లోకి ఎగువ నుంచి 1600 క్యూసెక్కుల వరదనీరు రావడంతో శుక్రవారం నీటిమట్టం 405.20 అడుగులకు పెరిగింది. దీంతో ప్రాజెక్ట్‌కు చెందిన ఒక గేటును ఎత్తి ఉంచి 3 వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేస్తున్నట్లు ఏఈ తెలిపారు.

కొత్త రైళ్ల జాడేది..?



సింగరేణి బొగ్గు రవాణా చేసేందుకు రోజూ జిల్లా మీదుగా 14కు తగ్గకుండా మాల్‌గాడీలు (గూడ్సు రైళ్లు) నడుస్తున్నాయి. తద్వారా కోట్లాది రూపాయల ఆదాయం రైల్వేకు దక్కుతోంది. ఇదే సమయంలో మాల్‌గాడీల్లో కనీసం సగం సంఖ్యలో అయినా ఇక్కడి ప్రజల అవసరాలకు తగినట్లు రైళ్లను నడిపించడం లేదు. రైల్వేశాఖ మొక్కుబడిగా నాలుగు రైళ్లతోనే నాలుగైదేళ్లుగా సరిపెడుతోంది. ఈ అంశంపై ఖమ్మం, మహబూబాబాద్ ఎంపీలు రామసహాయం రఘురాం రెడ్డి, పోరిక బలరాంనాయక్‌లు దృష్టిసారించాల్సిన అవసరం ఉంది.

–సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

రద్దయిన బండ్లను పునఃప్రారంభించని రైల్వే శాఖ

- బెళగావి రద్దుతో ఐటీ ఉద్యోగులకు ఇక్కట్లు
- డోర్నకల్, కాజీపేట రైళ్ల రద్దుకు ఐదేళ్లు పూర్తి
- బుట్టదాఖలవుతున్న తిరుపతి, షిర్డీ ప్రతిపాదనలు

తొమ్మిది నెలలుగా నడవని బెళగావి

జిల్లా కేంద్రం నుంచి రాష్ట్ర రాజధానికి చేరుకునేందుకు ఉదయం వేళ కాకతీయ, రాత్రి సమయంలో సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు అందుబాటులో ఉన్నాయి. వీటితోపాటు కరోనాకు ముందు మణుగూరు నుంచి కొల్హాపూర్ వరకు రైలు నడిచింది. రోజూ సాయంత్రం 5 గంటల సమయంలో బయల్దేరి వెళ్లేది. సికింద్రాబాద్ – బేగంపేట – లింగంపల్లిల మీదుగా కొల్హాపూర్ వరకు నడవడంతో ఎంతోమందికి ఉపయోగకరంగా ఉండేది. పశ్చిమ హైదరాబాద్‌లో నివసిస్తున్న ఐటీ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు సౌకర్యంగా ఉండేది. కరోనా సమయంలో ఈ రైలును రద్దు చేశారు. ఆ రైలు స్థానంలో 2022లో మణుగూరు – బెళగావి రైలు అందుబాటులోకి వచ్చింది. విజయవాడ-కాజీపేట మార్గంలో జరుగుతున్న మూడో లైను నిర్మాణ పనుల కారణంగా బెళగావిని ప్రతీ మూడు నాలుగు నెలలకోసారి రద్దుచేసేవారు. చివరగా 2024 డిసెంబరు 18న రైలును రద్దు చేయగా, ఆ తర్వాత మళ్లీ రైలును ప్రారంభించే అంశంపై రైల్వేశాఖ పెదవి విప్పడం లేదు. మరోవైపు మూడో లైను నిర్మాణ పనులు కూడా చివరి దశకు చేరుకున్నాయి.

సాయంత్రం రైళ్లేవి

జిల్లా కేంద్రం నుంచి ఉదయం 5 గంటలకు కాకతీయ, 6 గంటలకు సింగరేణి, మధ్యాహ్నం 1:45 గంటలకు విజయవాడ ప్యాసింజర్ రైళ్లు నడుస్తున్నాయి. రాత్రి వేళ 10:45 గంటలకు సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ఉంది. సాయంత్రం సమయంలో ఒక్కరైలు కూడా అందుబాటులో లేదు. గతంలో బెళగావి ట్రైన్ అందుబాటులో ఉండేది. వివిధ పనుల మీద కొత్తగూడెం వచ్చే సింగరేణి కార్మికులు సైతం ఈ రైలు ద్వారా వరంగల్/కాజీపేటకు చేరుకుని అక్కడి నుంచి మరోరైలు ద్వారా మంచిర్యాల, రామగుండం, బెల్లంపల్లి వంటి ప్రాంతాలకు వెళ్లేవారు. బెళగావిని తిరిగి ప్రారంభించకపోవడంతో ఇటు హైదరాబాద్, అటు కోల్‌బెల్ట్ ఏరియాలకు వెళ్లే ప్రయాణికులకు ఇక్కట్లు తప్పడం లేదు. కరోనాకు ముందు నడిచిన మణుగూరు -కాజీపేట ప్యాసింజర్ రైలు పగటి వేళ వరంగల్ – కొత్తగూడెం మధ్య రాకపోకలు సాగించేవారికి ఉపయుక్తంగా ఉండేది. ఐదేళ్ల క్రితం దీన్ని రద్దు చేసిన రైల్వే శాఖ తిరిగి ప్రారంభించే ఊసే ఎత్తడం లేదు. డోర్నకల్ – భద్రాచలంరోడ్ ప్యాసింజర్‌ది ఇదే పరిస్థితి.

డిమాండ్లకే పరిమితం

భద్రాచలంరోడ్ – పెద్దపల్లి– నిజామాబాద్ మీదుగా షిరిడీకి రైలు నడిపించాలనే డిమాండ్‌తో ఇచ్చిన వందలాది అర్జీలు బుట్టదాఖలవుతున్నాయి. భద్రాచలంరోడ్/మణుగూరుల నుంచి తిరుపతి వరకు రైలు నడిపించాలనే డిమాండ్ సైతం ఏళ్ల తరబడి అమలుకు నోచుకోవడం లేదు. కనీసం డోర్నకల్ మీదుగా ఈ రెండు పుణ్యక్షేత్రాలకు వెళ్లే రైళ్లకు భద్రాచలంరోడ్/మణుగూరుల నుంచి కనీసం ఐదారు స్లీపర్ కోచ్‌లను పంపే అంశాన్ని కూడా రైల్వేశాఖ పట్టించుకోవడం లేదు. దసరా, సంక్రాంతి, వేసవి సెలవుల సందర్భంగా వందలాది ప్రత్యేక ట్రైన్స్‌ను ప్రకటించే రైల్వేశాఖ ఏర్పాటు చేస్తున్నా అందులో ఒక్కటి కూడా జిల్లాకు కేటాయించడం లేదు. ఆఖరికి ముక్కోటి, శ్రీరామనవమి వంటి పర్వదినాలప్పుడు భద్రాచలం పుణ్యక్షేత్రానికి కూడా రైళ్లను నడిపించడంపై కొన్నేళ్లుగా మీనమేషాలు లెక్కిస్తూ వస్తోంది.

మంత్రులు దృష్టిసారించినా | కదలని దస్త్రం!



కరకట్ట పనులను పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు (ఫైల్)

- భద్రాచలం వద్ద గోదావరి కరకట్టకు 'క్రాసింగ్' బ్రేక్!
- జాతీయ రహదారిపై ఓవర్ బ్రిడ్జికి అనుమతుల్లో జాప్యం
- డిజైన్ పంపి రెండు నెలలు గడిచినా ఆమోదించని సీడీఓ
- వంతెన మినహా గోదావరి కరకట్ట పనులన్నీ పూర్తి



ఓవర్ క్రాసింగ్ బ్రిడ్జి నిర్మించాల్సిన నేషనల్ హైవే

భద్రాచలం: గోదావరి కరకట్టలో భాగంగా చేపట్టిన క్రాసింగ్ బ్రిడ్జి నిర్మాణానికి అడుగులు ముందుకు పడటం లేదు. సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ నుంచి అనుమతులు రావడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. కరకట్ట నిర్మాణం దాదాపుగా పూర్తయినా జాతీయ రహదారిపై క్రాసింగ్ బ్రిడ్జి పెండింగ్‌లో పడిపోయింది. గోదావరి వరదల నుంచి భద్రాచలానికి రక్షణగా 2000 సంవత్సరంలో కరకట్ట నిర్మించారు. కూనవరం రోడ్డుకు ఇరువైపులా 700 మీటర్ల మేర పనులు అప్పుడు ఆగిపోయాయి. ఆ పనులను రూ. 38 కోట్లతో పూర్తి చేస్తామని బీఆర్ఎస్ ప్రభుత్వం గత ఎన్నికల ముందు హామీ ఇచ్చింది. ఆ తర్వాత గెలిచి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు విడుదల చేసి పనులు చేపట్టింది. 2024 జూన్ నాటికి పనులు పూర్తికావాల్సి ఉండగా, ఇప్పటివరకు మట్టి, రిటైనింగ్, ఇతర పనులు పూర్తయ్యా యి. కరకట్టలో నిర్మాణంలో భాగంగా విజయవాడ–జగదల్‌పూర్ జాతీయ రహదారిపై తలపెట్టిన ఓవర్ క్రాసింగ్ బ్రిడ్జి నిర్మాణంలో మాత్రం కదలిక లేదు.

సీడీఓ అనుమతుల్లో జాప్యం

నిర్మాణ పనుల బాధ్యత తీసుకున్న ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ బ్రిడ్జి డిజైన్‌ను రూపొందించి అనుమతి కోసం హైదరాబాద్‌లోని సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్(సీడీఓ)కు పంపించింది. రెండు నెలలు గడిచినా అక్కడి నుంచి అనుమతి రాలేదు. సీడీఓ సూచనల ప్రకారం పలుమార్లు డిజైన్‌లో మార్పులు చేశారు. మళ్లీ ఇటీవల కరకట్ట రిటైనింగ్ వాల్, ఇతర సమస్యలను ప్రస్తావిస్తూ సీడీఓ అధికారులు సందేహాలను వ్యక్తం చేశారు. దీంతో బ్రిడ్జి కథ మళ్లీ మొదటికొచ్చింది. ఈ నేపథ్యంలో డిజైన్ ఫైనల్ కావడానికి ఎంత సమయం పడుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. సాధారణంగా ఇలాంటి పనులను తగిన బడ్జెట్‌ను అందచేస్తే ఆయా శాఖలే పూర్తి చేస్తాయి. తమదికాని నిర్మాణాలను ఒప్పుకున్న ఇరిగేషన్ శాఖ అధికారులు పనులు పూర్తి చేయలేక తలలు పట్టుకుంటున్నారు.

నిర్మాణ వ్యయం పెరిగే అవకాశం

బ్రిడ్జి డిజైన్‌ను సీడీఓ ఆమోదించాక ఆర్‌అండ్‌బీ, నేషనల్ హైవే శాఖలు ఆమోదించాల్సి ఉంది. ఆ తర్వాత దస్త్రం ప్రభుత్వం వద్దకు పంపితే నిధులు కేటాయిస్తుంది. గతంలో కరకట్టకు రూ.38 కోట్లు విడుదల చేయగా, ప్రస్తుతం ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.70 కోట్ల నుంచి రూ.100 కోట్ల వరకు ఖర్చవుతుందని అధికారులు చెబుతున్నారు. జిల్లా మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డిలు ఇప్పటికే పలుమార్లు కరకట్టను పరిశీలించారు. అయినా క్రాసింగ్ బ్రిడ్జి నిర్మాణంలో కదలికలేదు. ఇప్పటికైనా దృష్టి సారించి త్వరితగతిన ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకోవాలని భద్రాచలం ప్రజలు కోరుతున్నారు.

సీడీఓ సూచనల ప్రకారం..



ఓవర్ క్రాసింగ్ బ్రిడ్జి, కరకట్ట, అప్రోచ్ రోడ్డులకు సంబంధించి డిజైన్ సీడీఓకు పంపించాం. వారి సూచనల ప్రకారం చేర్పులు, మార్పులతో నూతన డిజైన్ రూపొందిస్తాం. వీలైనంత తొందరగా పనులను పూర్తి చేసేందుకు కృషి చేస్తాం.

– సయ్యద్ అహ్మద్ జానీ, ఇరిగేషన్ ఈఈ, భద్రాచలం డివిజన్

రైతులకు తప్పని యూరియా వెతలు



పాల్వంచ రూరల్: యూరియా కోసం జగన్నాథపురం రైతువేదికలో కిక్కిరిసిన రైతులు



ఇల్లెందు: వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో ఎదురుచూస్తున్న రైతులు

ఇల్లెందు/పాల్వంచరూరల్: రైతులకు యూరియా వెతలు తీరడంలేదు. పంపిణీ కేంద్రాల వద్ద తెల్లవారుజామునుంచే బారులుదీరుతున్నారు. గురువారం వరకు పాల్వంచ పట్టణంలోని సహకార సొసైటీ కార్యాలయంలో అధికారులు యూరియా పంపిణీ చేశారు. శుక్రవారం జగన్నాథపురం రైతువేదికలో పంపిణీ చేపట్టారు. దీంతో జగన్నాథపురం, కేశవాపురం, సోములగూడెం, తోగ్గూడెం, నాగారం, రంగాపురం, దంతలబోరు, బంద్రుగొండ, సంగం తదితర గిరిజన గ్రామాల రైతులు తరలివచ్చారు. దీంతో రైతువేదిక నిండిపోయింది. 320 మంది రైతులు తమ పేర్లను రిజిస్టర్ చేసుకోగా, 220మంది రైతులకే యూరియా పంపిణీ చేశారు. రిజిస్ట్రేషన్ చేసుకున్నా ఇంకా 100 మందికి యూరియా దొరకలేదు. మిగిలిన రైతులకు సోమవారం లోడ్ వస్తే పంపిణీచేస్తామని ఏఓ శంకర్ తెలిపారు. ఇక ఇల్లెందులోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన పంపిణీ కేంద్రం వద్దకు రొంపేడు, మసివాగు, ముత్తారపుకట్ట తదితర గ్రామాల నుంచి తెల్లారేసరికే రైతులు చేరుకున్నారు. రోజంతా క్యూలైన్‌లో నిలబడలేక చెప్పులు క్యూలో పెట్టి ఎదురుచూశారు. ఇల్లెందు, చల్లసముద్రం, సుదిమళ్ల, కొమరారం కేంద్రాలుగా యూరియా పంపిణీ కేంద్రాలు తెరిచి 1,860 మెట్రిక్ టన్నుల యూరియాను సుమారు 10 వేల మంది రైతులకు పంపిణీ చేసినట్లు అధికారులు చెబుతున్నాయి. అయినా పంటలకు సరిపడా యూరియా అందక రైతులు గోస పడుతున్నారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ ఏడీఏ సుధాకర్, సొసైటీ కార్యదర్శి శ్రీనివాస్, సీఈఓ సత్యం, స్టాక్ అసిస్టెంట్ లక్ష్మి పాల్గొన్నారు.

స్ట్రక్చరల్ సమావేశం బహిష్కరణ

సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం నేతలు సీతారామయ్య, రాజ్‌కుమార్



మాట్లాడుతున్న సీతారామయ్య

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి యాజమాన్యం మొండివైఖరి వల్లే స్ట్రక్చరల్ సమావేశాన్ని బహిష్కరించినట్లు సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం (ఏఐటీయూసీ) అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఏడాదికాలంలో మూడుసార్లు నిర్వహించిన సమావేశాల్లో అంగీకరించిన అంశాలపై యాజమాన్యం ఇప్పటివరకు సర్క్యులర్ జారీ చేయకుండా కాలయాపన చేస్తోందని ఆరోపించారు. సొంతింటి పథకంపై కమిటీ వేసినా ఇంతవరకు సమావేశం నిర్వహించలేదన్నారు. ఏసీబీ బూచి చూపి మెడికల్ బోర్డ్‌ను నిలిపివేయడం యాజమాన్య తప్పిదమేనని అన్నారు. గతంలోలాగే మెడికల్ బోర్డ్ నిర్వహించాలని కోరారు. కంపెనీ వాస్తవ లాభాలు ప్రకటించి, 35శాతం కార్మికులకు వాటాను చెల్లించాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు మిరియాల రంగయ్య, సారయ్య, వీరభద్రయ్య, సమ్మయ్య, ఎల్లయ్య, వెంకటి, ఎం.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో 'తెర'గతి గది



మండలంలోని మారుమూల కొత్త కావడిగుండ్ల గ్రామంలో ప్రభుత్వ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉంది. ఇక్కడ ఇద్దరు ఉపాధ్యాయినులు విధులు నిర్వహిస్తున్నారు. ఒకటి నుంచి ఐదు తరగతుల వరకు 30 మంది విద్యార్థులు ఉన్నారు. పాఠశాల భవనంలో ఒకే తరగతి గది ఉండగా, అందులో ఐదు తరగతులు నిర్వహించడం కష్టంగా మారింది. దీంతో ఉపాధ్యాయులు వరండాకు గ్రీన్ షీట్‌ను ఏర్పాటు చేసి మరో తరగతి గదిని ఏర్పాటు చేసుకుని పాఠాలు బోధిస్తున్నారు.

– అశ్వారావుపేటరూరల్

భావ ప్రకటన స్వేచ్ఛకు సంకెళ్లు సరికాదు



ఆంధ్రప్రదేశ్‌లో పౌరహక్కులు, జర్నలిస్టుల స్వేచ్ఛను హరించేలా తెలుగుదేశం నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును పలువురు తప్పుపడుతున్నారు. 'సాక్షి' తెలుగు దినపత్రికకు చెందిన పలు ఎడిషన్ కేంద్రాలపై టీడీపీ నాయకులు, కార్యకర్తలు దాడి చేసి ఆస్తులను ధ్వంసం చేశారు. ఈ విషయంలో ఫిర్యాదు చేసినా పోలీసులు కేసులు నమోదు చేయలేదు. ఇక ప్రభుత్వం హామీల అమలులో చేస్తున్న జాప్యంపై ప్రజల పక్షాన వార్తల ప్రచురిస్తే మాత్రం కేసులు నమోదు చేసి సాక్షి కార్యాలయాలు, జర్నలిస్టుల ఇళ్లలో సోదాలు చేస్తున్నారు. తాజాగా 'సాక్షి' ఎడిటర్ ధనుంజయరెడ్డి, ఇతర జర్నలిస్టులపై కేసులు నమోదు చేస్తూ రాజ్యాంగం ప్రసాదించిన భావ ప్రకటనా స్వేచ్ఛను అక్కడి ప్రభుత్వం తమ గుప్పిట్లోకి తీసుకునేలా చేస్తున్న ప్రయత్నాలపై పలువురు మండిపడ్డారు.

– ఖమ్మం సహకారనగర్ / ఖమ్మం లీగల్

దాడులు నిలిపేయాలి



సమాజ శ్రేయస్సు, ప్రజల కోసం నిస్వార్థంగా పనిచేసే జర్నలిస్టులు, మీడియా సంస్థలపై దాడులు చేయడం హేయమైన చర్య. ఏపీలో 'సాక్షి' పత్రిక ఎడిటర్, జర్నలిస్టులపై అక్కడి ప్రభుత్వం కక్ష్యపూరితంగా వ్యవహరించడం సరికాదు. ప్రజాస్వామ్యంలో నాలుగో మూలస్తంభంగా వ్యవహరించే పత్రికా రంగంపై దాడులను నిలిపేయాలి. 'సాక్షి' ఎడిటర్, జర్నలిస్టులపై నమోదుచేసిన కేసులను ఏపీ ప్రభుత్వం ఉపసంహరించుకోవాలి.

– మోదుగు వేలాద్రి, టీజీవోస్ ఖమ్మం జిల్లా కార్యదర్శి

అక్రమ కేసులు గర్హనీయం



'సాక్షి' ఎడిటర్ ధనుంజయరెడ్డిపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అక్రమంగా కేసులు నమోదు చేయడం గర్హనీయం. ప్రభుత్వాలు ఇలా కక్షపూరితంగా వ్యవహరించడం సరైన విధానం అనిపించుకోదు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఉన్నప్పుడు నియంతృత్వంతో వ్యవహరించడం, పత్రికాస్వేచ్ఛను అణచివేసేలా ప్రభుత్వాలు ప్రయత్నించడం శోచనీయం. మీడియా కార్యాలయాలపై దాడులు, జర్నలిస్టులపై కేసులను ఖండిస్తున్నాం.

– కర్లపూడి శ్రీనివాసరావు, మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్, ఖమ్మం

గొంతు నొక్కేయడం కక్షే..



పత్రికా స్వేచ్ఛను హరించేలా ప్రజల పక్షాన పనిచేసే జర్నలిస్టుల గొంతు నొక్కేయడం సరికాదు. ఇది భారత రాజ్యాంగం ప్రసాదించిన భావ ప్రకటన స్వేచ్ఛను హరించడమే. 'సాక్షి' ఎడిటర్ ధనుంజయరెడ్డి, ఇతర జర్నలిస్టులపై ఏపీ ప్రభుత్వం అక్రమంగా కేసులు నమోదు చేయడం, అక్కడ ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరించడం తగదు. ప్రజల పక్షాన నిలిచే వారిపై నమోదు చేసిన కేసులను తక్షణమే ఉపసంహరించుకోవాలి.

– సింగం జనార్దన్, టీపీసీసీ లీగల్ సెల్ కన్వీనర్, ఖమ్మం

పత్రికా స్వేచ్ఛను హరించొద్దు



ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడమే కాక ప్రజలను చైతన్యవంతులను చేసేలా పత్రికలు వ్యవహరిస్తాయి. అలాంటి పత్రికల స్వేచ్ఛను హరించడం సరికాదు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయికి చేరాలన్నా... ప్రజలకు ఏమేం వసతులు కావాలో ప్రభుత్వం దృష్టికి వెళ్లడంలో పత్రికలు కీలకంగా నిలుస్తాయి. కానీ ఏపీలో ప్రజల పక్షాన వార్తలు రాస్తున్న 'సాక్షి' ఎడిటర్ ధనుంజయరెడ్డి, జర్నలిస్టులపై కేసులు పెట్టడం సరికాదు.

– ఎస్.విజయ్, టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి

విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి

కలెక్టర్ జితేష్ వి.పాటిల్



ఎన్‌సీసీ విద్యార్థులతో కలెక్టర్ జితేష్

అశ్వాపురం: ఎన్‌సీసీ విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో ఉన్నత స్థానాలకు ఎదగాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. మండల పరిధిలోని మిట్టగూడెంలోని గిరిజన సంక్షేమ గురుకుల బాలుర డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న ఎన్‌సీసీ శిబిరంలో శుక్రవారం కలెక్టర్ విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. క్రమశిక్షణ అలవర్చుకోవాలని, లక్ష్యాలు నిర్దేశించుకుని ముందుకు సాగాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో క్యాంప్ కమాండెంట్ కల్నల్ సంజయ్‌కుమార్ భద్ర, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కల్నల్ నవీన్ యాదవ్, కళాశాల ప్రిన్సిపాల్ రవికుమార్, తహసీల్దార్ మణిధర్, విద్యార్థులు పాల్గొన్నారు.

నానో యూరియాతో ఇన్సూరెన్స్ సౌకర్యం

టేకులపల్లి: నానో యూరియాతో రైతులకు రూ. 2 లక్షల వరకు ఇన్సూరెన్స్ సదుపాయం ఉందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వేల్పుల బాబూరావు తెలిపారు. శుక్రవారం టేకులపల్లిలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో డ్రోన్ ద్వారా నానో యూరియా, నానో డీఏపీ పిచికారీపై డెమో ద్వారా రైతలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇఫ్కో యూరియా నాలుగు బాటిళ్లు కొన్నవారు బిల్లు భద్రపరచుకోవాలని చెప్పారు. రైతు ప్రమాదవశాత్తు మృతి చెందితే ఇన్సూరెన్స్ లభిస్తుందని తెలిపారు. డిప్యూటీ ప్రాజెక్టు డైరెక్టర్ బి.సరిత, ఏఓ అన్నపూర్ణ, శ్రావణి, విశాల పాల్గొన్నారు.

క్లుప్తంగా

సింగరేణి క్రీడలు ప్రారంభం



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న జీఎం

కొత్తగూడెంఅర్బన్: సింగరేణి కార్పొరేట్ ఏరియా వర్క్ పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ ఆధ్వర్యంలో వార్షిక క్రీడా పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో పోటీలను జీఎం (పర్సనల్) ఈఈ సెల్ ఏ.జే.మురళీధర్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్నేహ భావంతో క్రీడల్లో రాణించాలని సూచించారు. శారీరక దృఢత్వానికి, ఆరోగ్యానికి క్రీడలు ఉపయోగపడతాయని తెలిపారు. తొలిరోజు ఫుట్‌బాల్ మ్యాచ్‌ను హెడ్డాఫీస్ జట్టు, ఎస్‌పీసీ జట్లు మధ్య నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు, క్రీడల నిర్వహణ బాధ్యులు బి.శివకేశవరావు, ఎస్.వెంకటాచారి, ఎస్‌వి.రమణమూర్తి, ఎస్.పీతాంబరరావు, కే.సునీల్‌కుమార్, ఉదయ్‌కుమార్, పోస్‌నెట్, కె.వరప్రసాద రావు, పి.నితిన్ కుమార్, పి.నాగి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గడువులోగా లక్ష్యం చేరాలి

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలో టాస్ అడ్మిషన్ల లక్ష్యాన్ని గడువులోగా పూర్తి చేయాలని ట్రైనీ కలెక్టర్ సౌరబ్‌శర్మ తెలిపారు. శుక్రవారం జిల్లాలోని ఏఐ కో ఆర్డినేటర్లకు, అసిస్టెంట్ కోఆర్డినేటర్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. అధికారులు విద్యాచందన, నాగలక్ష్మి, కె.మంగపతిరావు, సైదులు, ఏ.నాగరాజ శేఖర్ పాల్గొన్నారు.

భగత్ ఆశయాల సాధనకు కృషి చేయాలి



మాట్లాడుతున్న మొహిందర్‌సింగ్

సూపర్‌బజార్(కొత్తగూడెం): దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు అర్పించిన భగత్‌సింగ్ ఆశయాల సాధనకు కృషి చేద్దామని ఐటీసీ అంతర్జాతీయ అధ్యక్షుడు మొహిందర్‌సింగ్ గిల్జైజన్ అన్నారు. శుక్రవారం సీపీఐ జిల్లా కార్యాలయంలో భగత్‌సింగ్ యూత్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సిక్కు కుటుంబాల సదస్సులో ఆయన మాట్లాడారు. సిక్కు జాతికి దేశం కోసం ప్రాణాలను సైతం లెక్కచేయని పోరాట పటిమ ఉంటుందని అన్నారు. సిక్కుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కె సాబీర్‌పాషా మాట్లాడుతూ సిక్కు కుటుంబాలకు సీపీఐ అండగా ఉంటుందని అన్నారు. ఐటీసీ సభ్యులు నల్లా సురేష్‌రెడ్డి, వెంకటేష్‌రెడ్డి, ఎస్ శ్రీనివాస రెడ్డి, మధుసూధన్‌రెడ్డి, సీపీఐ నాయకులు కంచర్ల జమలయ్య, వాసిరెడ్డి మురళి, భూక్య శ్రీనివాస్, మాచర్ల శ్రీనివాస్, ధర్మరాజు, యూసుఫ్, బోయిన విజయ్‌కుమార్, సత్యనారాయణ చారి, నేరెళ్ల రమేష్, దుర్గ, ఫెడరేషన్ నాయకులు పున్నం సింగ్ పాల్గొన్నారు.

పాల్వంచలో..

పాల్వంచ: ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ యూఎస్ఏ చైర్మన్ మొహిందర్ సింగ్ శుక్రవారం పాల్వంచలో పర్యటించారు. దమ్మపేట సెంటర్‌లో ఇందిరా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం హెచ్ కన్వెన్షన్ హాల్‌లో విలేరులతో మాట్లాడారు. శ్యామలా గోపాలన్ ట్రస్ట్ సేవా కార్యక్రమాలను అభినందించారు. కాంగ్రెస్ నాయకులు నాగా సీతారాములు, పట్టణ అధ్యక్షుడు నూకల రంగారావు, సందుపట్ల శ్రీనివాస్ రెడ్డి, మధుసూధన్ రెడ్డి, యుగంధర్ రెడ్డి, డాక్టర్ ప్రవీణ్, శ్యామలా గోపాలన్ ఎడ్యుకేషన్ సొసైటీ చైర్మన్ నల్లా సురేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సదస్సుకు హాజరైన పీఓ



జాతీయ సదస్సులో పీఓ రాహుల్

భద్రాచలం: ఈ నెల 9,10వ తేదీల్లో న్యూఢిల్లీలో జరిగిన గిరిజనాభివృద్ధి జాతీయ సదస్సులో భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి బి రాహుల్ పాల్గొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన వివరాలు వెల్లడించారు. కేంద్ర గిరిజన మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో వివిధ రాష్ట్రాల గిరిజన సంక్షేమ కార్యదర్శులు, ప్రాజెక్ట్ అధికారులు పాల్గొన్నారు. జిల్లా ఏజెన్సీ ఏరియాలోని 130 గ్రామాల్లో ఆది కర్మయోగి అభియాన్, దర్తీ ఆబా జన్ జాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్, అటవీ హక్కుల చట్టం అమలు తీరుపై సదస్సులో వివరించినట్లు తెలిపారు. అనంతరం గిరిజన మ్యూజియం పుస్తకాన్ని కేంద్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రికి అందించినట్లు పేర్కొన్నారు.

పామాయిల్ గెలలు	
టన్ను ధర	రూ.19,107


ఈజీగా రాజీ!

- నేడు జాతీయ లోక్ అదాలత్
- జిల్లాలోని 5 కోర్టుల్లో నిర్వహణ
- పెండింగ్ కేసుల సత్వర పరిష్కారం

భద్రాచలంఅర్బన్: బాధితులు ఏళ్లపాటు కోర్టుల చుట్టూ తిరగకుండా, సత్వరమే కేసులు పరిష్కరించేలా న్యాయస్థానాలు లోక్ అదాలత్‌లు నిర్వహిస్తున్నాయి. లీగల్ సర్వీస్ అథారిటీ చట్టం-1987 ప్రకారం లోక్ అదాలత్‌ల ద్వారా ఏటా వేల సంఖ్యలో పెండింగ్ కేసులను పరిష్కరిస్తున్నాయి. బాధితులకు సత్వరమే న్యాయం అందిస్తున్నాయి. ఈ క్రమంలోనే ఈ నెల 13న జిల్లాలోని కొత్తగూడెం, భద్రాచలం, మణుగూరు, దమ్మపేట, ఇల్లెందు కోర్టుల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నారు.

తీర్పు అంతిమం..

రాజీకి అవకాశం ఉన్న కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్క రించుకోవచ్చు. ఇక్కడ ఇచ్చే తీర్పే అంతిమం. లోక్ అదాలత్‌లో పరిష్కారమైన కేసుల విషయంలో ఇచ్చిన తీర్పులకు వ్యతిరేకంగా ఏ న్యాయస్థానం ముందూ అప్పీల్ చేయడం కుదరదు. లోక్ అదాలత్ తీర్పుతో ఇరుపక్షాల మధ్య మంచి సంబంధాలు కూడా ఏర్పడతాయి.



పరిష్కారం చూపే కేసులు..

క్రిమినల్, సివిల్, వివాహ, కుటుంబ తగాదా, రోడ్డు ప్రమాదం, చిట్ ఫండ్, డ్రంకెన్ డ్రైవ్, ట్రాఫిక్ తదితర కేసులను పరిష్కరించుకోవచ్చు. దొంగతనం, బ్యాంకు రికవరీ, సెల్‌ఫోన్ రికవరీ, విద్యుత్ చౌర్యం చెక్ బౌన్స్ కేసులు, కార్మిక సంబంధిత కేసులు, క్రిమినల్ కంపౌండబుల్ కేసులు కూడా పరిష్కరించుకోవచ్చని న్యాయవాదులు చెబుతున్నారు.

లోక్ అదాలత్‌తో ప్రయోజనాలు

- సంవత్సరాల తరబడి సాగే న్యాయపరమైన చిక్కుల నుంచి విముక్తి.
- ఫార్మల్ కోర్టు విచారణ అవసరం లేకుండా సులభంగా పరిష్కారం.
- లీగల్ ఫీజులు, కోర్టు ఖర్చులు తగ్గుతాయి.
- తక్కువ ఖర్చుతో, శాంతియుతంగా వివాదాలను ముగించే అవకాశం.

సద్వినియోగం చేసుకోవాలి



పెండింగ్‌లో ఉన్న, రాజీ కుదుర్చుకునేందుకు అవకాశం ఉన్న అన్ని కేసుల్లో కక్షిదారులు జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి. రాజీ పడదగిన కేసుల్లో ఇరువర్గాలకు కౌన్సెలింగ్ నిర్వహించి, వీలైనన్ని ఎక్కువ కేసులు రాజీపడేలా చూడాలి.

– విక్రాంత్ కుమార్ సింగ్, ఏఎస్పీ, భద్రాచలం

విజయవంతం చేయాలి



భద్రాచలం డివిజన్ పరిధిలోని న్యాయవాదులు, పోలీసులు, బ్యాంక్ అధికారులు జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి. కోర్టుల చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండదు. రాజీమార్గంతో ఎక్కువ కేసుల పరిష్కారానికి సహకరించాలి.

– శివనాయక్, ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్, భద్రాచలం

కేటీపీఎస్ సొసైటీ అధ్యక్ష పీఠం ఎవరికో?

పాలక మండలి పదవుల కోసం పావులు కదుపుతున్న డైరెక్టర్లు

పాల్వంచ: కేటీపీఎస్, బీటీపీఎస్, వైటీపీఎస్ ఉద్యోగుల క్రెడిట్ సొసైటీ అధ్యక్ష పీఠం కోసం మంతనాలు జోరందుకున్నాయి. పాలక మండలి పదవుల కోసం ఎవరికివారు ప్రయత్నాలు సాగిస్తున్నారు. స్థానిక డీఏవీ పాఠశాలలో సొసైటీ డైరెక్టర్ల ఓట్ల లెక్కింపు ప్రక్రియ గురువారం అర్ధరాత్రి ముగిసింది. ఎన్నికల్లో బీసీ కేటగిరీలో తోట అనిల్ కుమార్, కోన నాగేశ్వరరావు, ఎస్సీ ఉమెన్ విభాగంలో దాసరి వీరమణి, ఓసీ ఉమెన్ విభాగంలో రావు స్పందన, ఎస్టీ విభాగంలో నూనావత్ కేశులాల్, ఎస్సీ జనరల్ విభాగంలో వల్లమల ప్రకాశరావు, జనరల్ విభాగంలో దానం నరసింహారావు, డోలీ శ్రీనివాసరావు, వీరమల్లు రఘుకృష్ణ, సిద్ధి ప్రశాంత్, బుద్దార్థి మహేందర్, ధర్మరాజుల నాగేశ్వరరావు, సిద్దెల హుస్సేన్‌లు డైరెక్టర్లుగా గెలుపొందారు. విజేతలు రంగులు పులుముకుని సంబరాలు జరుపుకున్నారు.



కొత్తగా ఎన్నికైన డైరెక్టర్లను సన్మానిస్తున్న యూనియన్ల నాయకులు

అధ్యక్ష పదవి కోసం పోటీ

పాలక మండలి అధ్యక్ష పీఠం కోసం గతంలో పనిచేసిన దానం నర్సింహారావు, ధర్మరాజుల నాగేశ్వరరావులు పోటీ పడుతున్నారు. చెరో రెండేళ్ల చొప్పున అధ్యక్ష పదవిలో ఉండేలా ఒప్పందం చేసుకుంటున్నట్లు సమాచారం. సెక్రటరీ పోస్టు కోసం డోలి శ్రీనివాసరావు, కోన నాగేశ్వరరావు, కోశాధికారిగా మహేందర్, కేశులాల్‌లు పోటీ పడుతున్నారు. వైస్ ప్రెసిడెంట్‌గా తోట అనిల్‌కుమార్ పోటీ పడుతున్నట్లు తెలుస్తోంది. శుక్రవారం కొత్తపాలక వర్గం కొలువు దీరేలా కార్మిక సంఘాల నాయకులు చొరవ తీసుకుంటున్నారు.

చేపపిల్లల పంపిణీకి రంగం సిద్ధం

ముగిసిన టెండర్ల దాఖలు గడువు

ఖమ్మంవ్యవసాయం: ఎట్టకేలకు చేపపిల్లల కొనుగోళ్ల టెండర్ల ప్రక్రియ శుక్రవారంతో పూర్తయింది. జిల్లాలో నిర్దేశించిన జలాశయాలకు చేపపిల్లలు సరఫరా చేసేందుకు టెండర్ల దాఖలు గడువు మూడుసార్లు పొడిగించిన అనంతరం ముగిసింది. ఈమేరకు ఏడుగురు కాంట్రాక్టర్లు టెండర్లు దాఖలు చేయగా, వీరి ఫామ్స్‌ను పరిశీలించి ఖరారు చేశాక చేపపిల్లల పంపిణీ మొదలుకానుంది.

ఖమ్మం జిల్లాకు 3.49కోట్ల పిల్లలు

ఖమ్మం జిల్లాలోని 882 రిజర్వాయర్లు, పెద్ద చెరువులు, చిన్న చెరువుల్లో నీటి సామర్థ్యం, విస్తీర్ణం ఆధారంగా చిన్న, పెద్ద చేప పిల్లలు పంపిణీ చేస్తారు. 80–100 మి.మీ.ల సైజు పెద్ద చేపపిల్లలు 2.11 కోట్ల వరకు, 35–40 మి.మీ. ఉండే చిన్నపిల్లలు 1.38 కోట్లు కలిపి 3.49 కోట్ల చేపపిల్లలకు జలాశయాల్లో విడదల చేయనున్నారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.4 కోట్లు వెచ్చించనుంది. కాగా, టెండర్లు దాఖలు చేసిన వారి సీడ్ ఫామ్స్‌ను జిల్లా మత్స్యశాఖ అధికారి నేతృత్వాన బృందం పరిశీలిస్తుంది. ఆతర్వాత అదనపు కలెక్టర్ చైర్మన్‌గా వ్యవహరించే కమిటీ టెండర్లను పరిశీలించి తక్కువ బిడ్ దాఖలు చేసిన వారిని ఎంపిక చేస్తారు. ఈ ప్రక్రియ త్వరగా పూర్తిచేసి జలాశయాల్లో చేపపిల్లలను వదలాలని మత్స్యశాఖ కసరత్తు చేస్తోంది.

పోడు భూములకు పట్టాలివ్వాలి

బూర్గంపాడు/భద్రాచలంటౌన్: అటవీ హక్కుల చట్టం ప్రకారం సాగులో ఉన్న పోడు భూములకు ప్రభుత్వం పట్టాలు మంజూరు చేయాలని, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా అన్నారు. బూర్గంపాడు మండల పరిధిలోని కృష్ణసాగర్ నుంచి భద్రాచలం ఐటీడీఏ వరకు సుమారు 10 కిలోమీటర్ల శుక్రవారం పాదయాత్ర నిర్వహించారు. అనంతరం ఐటీడీఏ ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనుల పత్తి పంటలను ధ్వంసం చేయడం, గిరిజన రైతులపై అటవీ అధికారులు దాడులు చేయడం మానుకోవాలని కోరారు. బూర్గంపాడు మండలంలో 2005 కంటే ముందు నుంచే గిరిజనులు పోడు సాగు చేసుకుంటున్నారని చెప్పారు. జిల్లావ్యాప్తంగా ఇంకా 90 వేల ఎకరాల పోడు భూములకు పట్టాలి ఇవ్వాల్సి ఉందని అన్నారు. అనంతరం కార్యాలయ పరిపాలనాధికారి సున్నం రాంబాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముక్యాల విశ్వనాథం, కల్లూరి వెంకటేశ్వరరావు, రావులపల్లి రవికుమార్, ముమ్వా వెంకటేశ్వర్లు, నరెడ్డి వుల్లా రెడ్డి, మున్నా లక్ష్మీ కుమారి, ఈసంశెట్టి పూర్ణచంద్ర రావు, పేరాల శ్రీనివాస్, జంగం మోహన్ రావు, శ్రీనివాస్, సాధనపల్లి సతీష్, అలవాల సీతారామ రెడ్డి, సోందె కుటుంబ రావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సాబీర్ పాషా

17న సాయుధ వారోత్సవాల సభ

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం భక్త రామదాసు కళాక్షేత్రంలో ఈనెల 17న నిర్వహించే తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారో త్సవాల ముగింపు సభకు సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఎం ఏ.బేబీ హాజరుకానున్నారని పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు తెలిపారు. ఖమ్మంలో శుక్రవారం ఆయన నా యకులు బండి రమేశ్, వై.విక్రమ్‌తో కలిసి మాట్లాడారు. వామపక్ష అభిమానులు హాజరుకావాలని కోరారు.

ముమ్మరంగా డిజిటల్ క్రాప్ సర్వే

- క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి నమోదు
- అక్టోబర్ 25 వరకు నమోదుకు గడువు

బూర్గంపాడు: జిల్లా వ్యాప్తంగా పంటల నమోదు కార్యక్రమం ముమ్మరంగా సాగుతోంది. గతేడాది సీసీఐ పత్తి విక్రయాల్లో జరిగిన అవకతవకలను దృష్టిలో ఉంచుకుని ఈ ఏడాది వ్యవసాయశాఖ పంటల నమోదును పక్కాగా చేస్తోంది. ఏఈఓలు వానాకాలంలో రైతులు సాగు చేసిన పంటల చేలకు క్షేత్రస్థాయిలో పరిశీలించి నమోదు చేస్తున్నారు. పట్టాదారు పాసుపుస్తకాల వివరాలు, విస్తీర్ణం, ఏ పంట వేశారు, రైతు ఆధార్‌కార్డు నంబర్, ఫోన్‌నంబర్ తదితర వివరాలను డీసీఎస్(డిజిటల్ క్రాప్ సర్వే) యాప్‌లో నమోదు చేస్తున్నారు. తొలుత పట్టా భూములలో పంట నమోదు కార్యక్రమం కొనసాగుతోంది. ఆ తర్వాత నాన్ డిజిటల్ సైన్ భూముల్లో సాగు చేసిన పంటల వివరాలను నమోదు చేస్తామని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు.

2.10 లక్షల ఎకరాలలో పత్తి సాగు

ఈ ఏడాది జిల్లాలో సుమారు 2.10 లక్షల ఎకరాలలో పత్తి, 1.85లక్షల ఎకరాలలో వరి సాగు చేశారు. మిర్చి, అపరాల సాగు ఇంకా కొనసాగుతోంది. అక్టోబర్ 25 వరకు పంటల నమోదు కార్యక్రమాన్ని పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది, ఇప్పటికే జిల్లాలో 40శాతం మేర నమోదు పూర్తయింది. డిజిటల్ క్రాప్ సర్వేలో పంటలు నమోదు చేసుకుంటే సీసీఐలో పత్తి, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించేందుకు ఇబ్బందులు ఉండవు. గతేడాది చాలామంది రైతులు క్రాప్ బుకింగ్ చేసుకోకపోవటంతో పత్తి, ధాన్యం అమ్మకాల సమయంలో నానా అగచాట్లు పడ్డారు.



కృష్ణసాగర్‌లో పంట నమోదు చేస్తున్న ఏఈఓ

గతేడాది పత్తి అమ్మకాల్లో ఏఈఓల చేతివాటం

గతేడాది పట్టాదారు పాసుపుస్తకాలు లేని రైతులు పత్తి విక్రయించుకునేందుకు వ్యవసాయశాఖ అధికారులు టెంపరరీ రిజిస్ట్రేషన్(టీఆర్)రాసి ఇచ్చారు. కొందరు ఏఈఓలు వ్యాపారులకు కూడా టీఆర్‌లు ఇవ్వడం, వాటిని మార్కెటింగ్ శాఖ అధికారులు ధ్రువీకరించటంతో సీసీఐ పత్తి అమ్మకాల్లో అవకతవకలు జరిగాయి. ఈ వ్యవహారంపై విజిలెన్స్ విచారణ కూడా జరిగింది. కొందరు వ్యవసాయశాఖ అధికారులు, 17మంది మార్కెటింగ్‌శాఖ కార్యదర్శులపై సస్పెన్షన్ వేటు పడింది. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈ ఏడాది వ్యవసాయశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పంటలు పరిశీలించాకే వివరాలు నమోదు చేస్తున్నారు. పంట నమోదు చేసుకుంటే పంటల బీమా, ప్రకృతి వైపరీత్యాలు వచ్చి పంట నష్టం జరిగినప్పుడు పరిహారం అందించేందుకు వీలుంటుంది. పంట నమోదు చేసుకోకుంటే ఏ పథకాలకు కూడా అర్హులు కాలేరని అధికారులు చెబుతున్నారు.

అనర్హులకు పోస్టింగ్ ఇచ్చారు..

స్టేషన్ తడికలపూడి పాఠశాలలో బాధితుల ఆందోళన

టేకులపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించిన ప్రీ ప్రైమరీ స్కూళ్లలో టీచర్, ఆయా పోస్టుల నియామకాల్లో అనర్హులకు పోస్టింగ్‌లు ఇచ్చారని బాధితులు ఆరోపించారు. నోటిఫికేషన్ రద్దు చేసి అర్హులను నియమించాలని కోరారు. శుక్రవారం మండలంలోని తావుర్యాతండా పంచాయతీ స్టేషన్ తడికలపూడి ప్రాథమిక పాఠశాల వద్ద పలువురు బాధితులు సుమారు రెండు గంటలపాటు ధర్నా నిర్వహించారు. స్టేషన్‌తడికలపూడి ప్రీ ప్రైమరీ స్కూల్‌లో టీచర్, ఆయా ఇద్దరు శుక్రవారం విధుల్లో చేరేందుకు రావడంతో వివాదం మొదలైంది. ఈ పంచాయతీకి చెందిన తమకు అన్ని అర్హతలున్నా నిబంధనలకు విరుద్ధంగా ఇతర పంచాయతీల నుంచి టీచర్, ఆయాలను నియమించారని బాధిత అభ్యర్థులు బాదావత్ మంగ, బానోతు మంజుల, బొర్ర స్వరూపారాణి, బాణోతు జ్యోతి, గుగులోత్ దివ్య భారతి ఆరోపించారు. ఈ విషయమై ఎంఈఓ జగన్‌ను వివరణ కోరగా.. టీచర్, ఆయా నియామకాలు జరగలేదని, దరఖాస్తులను అమ్మ ఆదర్శ కమిటీలకు పంపించామని తెలిపారు. వారు ఎంపిక చేసి వివరాలు పంపిస్తే, కలెక్టర్‌కు నివేదిస్తామని పేర్కొన్నారు. కాగా పైలట్ ప్రాజెక్ట్‌గా జిల్లాలో 21 ప్రీ ప్రైమరీ స్కూళ్లను ప్రారంభించనున్నారు. వీటిల్లో స్టేషన్ తడికలపూడి ప్రాథమిక పాఠశాల కూడా ఉంది. పాఠశాలల్లో టీచర్, ఆయా పోస్టుల భర్తీకి గత నెల 26న నోటిఫికేషన్ విడుదల చేశారు.



ఆందోళన చేస్తున్న బాధిత అభ్యర్థులు

భద్రాచలం ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ఖమ్మంమయూరిసెంటర్: భద్రాచలం ఆర్టీసీ డిపోలో పెరిగిన పనిభారం, మస్టర్ల కుదింపునకు వ్యతిరేకంగా ఐదు రోజుల నుంచి అక్కడి ఉద్యోగులు చేస్తున్న పోరాటానికి ఖమ్మం రీజియన్ ఆర్టీసీ కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ(జేఏసీ) మద్దతు తెలిపింది. ఈ సందర్భంగా శుక్రవారం ఖమ్మంలో పర్సనల్ ఆఫీసర్(పీ.ఓ)సంపత్‌కుమార్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేసి సమస్యను తక్షణమే పరిష్కరించాలని కోరారు. భద్రాచలం డిపో మేనేజర్ కార్మికులపై భారం మోపుతూ మస్టర్లు కుదిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు ఏ.కృష్ణ, వినోదరావు, పి.సుధాకర్, జి.మాధవరావు, పి.రమేష్, బుచ్చిబాబు, బి.హనుమంతరావు, ఆర్.టీ.రావు తదితరులు పాల్గొన్నారు.

వివాదాస్పద భూములకు ఫెన్సింగ్

ఖమ్మం అర్బన్: రఘునాథపాలెం సమీపాన ఖమ్మం అర్బన్ మండల పరిధి మల్లెమడుగు లో వివాదాస్పద భూములకు పోలీసుల పర్యవేక్షణలో రెవెన్యూ అధికారులు శుక్రవారం ఫెన్సింగ్ వేశారు. ఆర్డీఓ నరసింహారావు, తహసీల్దార్ సైదులు, ఉద్యోగులు భూములకు ఫెన్సింగ్ వేయించి ఎవరూ ప్రవేశించవద్దని సూచిస్తూ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. సుమారు 29ఎకరాల భూమికి సంబంధించి కొన్నేళ్లుగా మల్లెమడుగు రైతులు, భూములు కొనుగోలు చేసిన వ్యక్తులు, ప్రభుత్వానికి మధ్య వివాదం కొనసాగుతోంది. భూముల్లోకి ఎవరూ వెళ్లొద్దని కోర్టు ఆదేశాలు ఉన్నా కొందరు సాగు చేయడంతో ఫెన్సింగ్ వేయించామని ఆర్డీఓ, తహసీల్దార్ తెలిపారు.

ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు మృతి

మధిర: మధిరలో మృత్యుంజయ స్వామి ఆలయ సమీ పాన వైరా నదిలో ఈతకు వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందాడు. ఎర్రుపాలెం మండలం చొప్పకట్లపాలెంకు చెందిన తొర్లికొండ కృష్ణ(45) మధిరలో సెంట్రింగ్ వర్క్ చేస్తాడు. కొద్దిరోజులుగా మధిరచెరువులో ఈత నేర్చుకుంటున్న ఆయన పలువురితో కలిసి వైరా నదికి వెళ్లాడు. అయితే, చెక్‌డ్యామ్ వద్ద ప్రవాహంలో కృష్ణతో పాటు రామ్ కొట్టుకుపోయారు. ఈక్రమాన కృష్ణను రామ్ బయటకు లాగి వెళ్తుండగా ఒడ్డుకు వచ్చేసరికి కృష్ణ నీటిపై తేలియాడుతూ కనిపించాడు. కాగా, వరద భయంతో గుండె ఆగి మృతి చెందాడని భావిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అంతరాష్ట్ర గంజాయి ముఠా అరెస్ట్

దమ్మపేట: అంతరాష్ట్ర గంజాయి ముఠాను శుక్రవారం దమ్మపేట పోలీసులు అరెస్ట్ చేశారు. దమ్మపేట స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పాల్వంచ డీఎస్పీ సతీష్‌కుమార్ వివరాలు వెల్లడించారు. డీఎస్పీ కథనం ప్రకారం.. దమ్మపేట పోలీసులు, టాస్క్‌ఫోర్స్ సిబ్బందితో కలిసి ఎస్సై సాయికిషోర్ రెడ్డి మండలంలోని పట్వారిగూడెం గ్రామ శివారులో శుక్రవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో పాల్వంచ నుంచి దమ్మపేట వైపు వెళ్తున్న కారు అనుమానాస్పదంగా కనిపించగా పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. వాహనంలో తనిఖీ చేయగా రూ.43 లక్షల విలువైన 86 కేజీల గంజాయి లభించింది. కారులో ఎనిమిది మంది వ్యక్తులు ఉండగా ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. మరో ముగ్గురు పరారయ్యారు.

నిందితుల్లో సీఐఎస్‌ఎఫ్ కానిస్టేబుల్

పోలీసులు పట్టుకున్న ఐదుగురిలో ఏపీలోని మోతుగూడేనికి చెందిన పనగుడు శివకృష్ణ, తమిళనాడుకు చెందిన జయరామన్ మహేష్‌కుమార్, కృష్ణమూర్తి మారియప్పన్, కందసామి రంజిత్, రాము వసంత్ ఉన్నారు. వీరిలో శివకృష్ణ సీఐఎస్‌ఎఫ్‌లో కానిస్టేబుల్. ప్రస్తుతం డిప్యూటేషన్‌పై ఎన్‌డీఆర్‌ఎఫ్ పనిచేస్తూ కేరళలో నివాసం ఉంటున్నాడు. పరారైన వారిలో ఏపీలోని రాజమండ్రికి చెందిన ఓ మహిళ, ఒడిశా, తమిళనాడుకు చెందిన ఇద్దరు వ్యక్తులు ఉన్నారు. గంజాయి అక్రమ రవాణాపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టామని డీఎస్పీ తెలిపారు. ఈ ఆపరేషన్‌లో ఎస్సైతో పాటు హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు, కానిస్టేబుళ్లు వీర, లక్ష్మయ్య, రమేష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ సతీష్‌కుమార్, సీఐ నాగరాజు, ఎస్సై సాయికిషోర్ రెడ్డి

హత్య కేసులో ఒకరికి జీవిత ఖైదు

వరంగల్ లీగల్: స్నేహితుడిని హత్య చేసిన కేసులో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండలం రోళ్లగడ్డ తండాకు చెందిన పాల్తియా రమేశ్‌కు జీవిత ఖైదు, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ హనుమకొండ మొదటి అదనపు జిల్లా కోర్టు జడ్జి బి.అపర్ణాదేవి శుక్రవారం తీర్పు వెల్లడించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.రాజమల్లారెడ్డి తెలిపిన వివరాలు... పాల్తియా రమేశ్, హనుమకొండ రాయపురకు చెందిన యంజాల శివ మిత్రులు. వీరిద్దరు పాత ఇనుప సామగ్రి, చిత్తు కాగితాలు, ఖాళీ సీసాలు విక్రయిస్తూ జీవిస్తుండగా డబ్బు పంపకాల్లో తేడాతో గొడవలు మొదలయ్యాయి. రమేశ్ బాల్యం నుంచే చోరీ కేసుల్లో వరంగల్, హైదరాబాద్, ఖమ్మం జైళ్లలో శిక్ష అనుభవించాడు. మళ్లీ వరంగల్ చేరుకొని శివను కలవగా, 2023 సెప్టెంబర్ 13వ తేదీన గొడవ పడగా, శివ నిద్రించేందుకు హనుమకొండలోని మున్సిపల్ కార్యాలయం వద్దకు వెళ్లాడు. అయితే, ప్రతిసారి తనతో గొడవ పడుతున్నాడని భావించిన రమేశ్.. కాసేపటికి శివ వద్దకు వెళ్లి విచక్షణరహితంగా కొట్టి బంగ్లా పైనుంచి కిందికి నెట్టేయడమే కాక కర్ర, బండరాళ్లతో కొట్టి చనిపోయాడని నిర్ధారించుకుని పారిపోయాడు. అనంతరం రమేశ్ పోలీసులకు లొంగిపోగా విచారణలో నేరం రుజువు కావడంతో రమేశ్‌కు యావజ్జీవ కారాగార శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు వెల్లడించారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

భద్రాచలంటౌన్: పట్టణంలోని కరకట్ట రోడ్డులో శుక్రవారం గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. మృతుడి వయసు సుమారు 43 ఏళ్లు ఉంటుందని పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

ఏడుగురిపై కేసు నమోదు

టేకులపల్లి: నకిలీ స్టాంపు పేపర్లు సృష్టించిన వ్యవహారంలో ఏడుగురు వ్యక్తులపై శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేశారు. బోడు ఎస్ఐ పొడిశెట్టి శ్రీకాంత్ కథనం ప్రకారం... లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ల గ్రామానికి చెందిన సోమరాజు వెంకట రాజా రాంప్రసాద్, అతని కుటుంబ సభ్యులకు సంపత్ నగర్ గ్రామం గంగారం రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 303/2/157లో ఉన్న 70 ఎకరాల భూమి వారసత్వంగా సంక్రమించింది. ఆ భూమిని ఆక్రమించుకోవాలనే ఉద్దేశంతో ఏడుగురు వ్యక్తులు కలిసి నకిలీ స్టాంపు పేపర్లను మోసపూరితంగా సృష్టించారు. బాధితుడు వెంకట రాజా రాంప్రసాద్ ఫిర్యాదు మేరకు మాళోతు నాగలక్ష్మి, భూక్య భావ్‌సింగ్, గుగులోత్ సక్కుబాయి, మాళోతు బలరాం, మెట్ల వెంకటేశ్వర్లు, ఏలూరి కోటేశ్వర్‌రావు, కోరం చిట్టిబాబులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బీట్ ఆఫీసర్ ఆత్మహత్యాయత్నం

ఇల్లెందురూరల్: మండలంలోని పూబెల్లి బీట్ ఆఫీసర్ రాణి శుక్రవారం ట్యాబ్లెట్లు మింగి ఆత్మహత్యకు యత్నించింది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. పూబెల్లి శివారులో కోతుల బెడద తగ్గించుకునేందుకు రైతు చేను పక్కనే చెట్లను తొలగిస్తుండగా బీట్ అధికారి అడ్డుకుంది. ఈ విషయంలో సదరు రైతు పురుగుల మందు తాగినట్లు గ్రామస్తులు ఆరోపించారు. నాటి నుంచి రాణి మానసికంగా ఒత్తిడికి గురవుతోంది. శుక్రవారం కుటుంబ సభ్యులు ఖమ్మంలో శుభ కార్యానికి వెళ్లగా ఆమె ఇంట్లో ఉన్న టాబ్లెట్లు మింగింది. గమనించిన బంధువులు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి స్థిమితంగా ఉందని వైద్యులు తెలిపారు. ఇల్లెందు రేంజ్ అటవీసిబ్బంది, యూనియన్ నాయకులు కోటి, మురళి తదితరులు రాణిని పరామర్శించారు.

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.